


## 'ధురంధర్' ఫార్ములాను ఫాలో అవుతున్న 'ది ప్యారడైస్' దర్శకుడు



నాచురల్ స్టార్ నాని హీరోగా, మమతా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైస్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయనున్నట్లు ప్రకటించగా, అనంతరం విడుదల తేదీని ఆగస్టు 21కు వాయిదా వేశారు. అయితే ప్రస్తుతం ఈ సినిమా ఆగస్టు 21న కూడా విడుదలయ్యే అవకాశాలు కనబడడం లేదు. ఈ చిత్ర విడుదల తేదీ పదేపదే వాయిదా పడుతున్న నేపథ్యంలో తాజాగా ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'ది ప్యారడైస్' చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.


అందులో భాగంగా రెండు పార్ట్‌లకు సంబంధించిన షూటింగ్‌ను ఒకేసారి పూర్తి చేసి మొదటి భాగం విడుదలైన తక్కువ వ్యవధిలోనే రెండో భాగాన్ని కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాల షూటింగ్‌ను ఒకేసారి పూర్తి చేసే ప్రక్రియ కారణంగానే సినిమా విడుదల ఆలస్యమవుతోందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల 'ధురంధర్' చిత్రాన్ని కూడా రెండు భాగాలుగా విడుదల చేసి, రెండు పార్ట్‌ల షూటింగ్‌ను ఒకేసారి పూర్తి చేసిన సంగతి తెలిసిందే. అదే ఫార్ములాను 'ది ప్యారడైస్' విషయంలో శ్రీకాంత్ ఓదెల ఫాలో అవుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.




## 'రావు బహదూర్' కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ 'జస్ట్ ఎ టీజర్' అంటూ పోస్ట్

వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ ప్రధాన పాత్రలో వస్తున్న చిత్రం 'రావు బహదూర్'. 'జీఎంబీ ఎంటర్‌టైన్మెంట్' పతాకంపై టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు సమర్పిస్తున్న ఈ సినిమాకు వెంకటేశ్ మహా దర్శకత్వం వహిస్తున్నాడు. ఓ రాజవంశం నేపథ్యంలో సాగే సైకలాజికల్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టులో సత్యదేవ్ విభిన్న లుక్స్‌తో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన సత్య లుక్‌కు సోషల్ మీడియాలో సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అయితే.. ఈ సినిమా జూన్ 5న రిలీజ్ కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. ఈ క్రమంలోనే 'రావు బహదూర్' మూవీ రిలీజ్ డేట్ ఇస్తూ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'రావు బహదూర్ పిచ్చిని చూడటానికి సిద్ధంగా ఉండండి.. 'జస్ట్ ఎ టీజర్' జూన్ 12న విడుదల కానుంది.. సినిమా 3 జూలై 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది' అంటూ ఓ పోస్టర్ షేర్ చేశారు మేకర్స్.

## శనివారం నుంచి 'పెద్ది'లో కొత్త సీన్స్



రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేశారు. విడుదల అనంతరం ఈ సినిమాకు మిశ్రమ స్పందన లభించినప్పటికీ, కొన్ని సన్నివేశాల విషయంలో ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా జాన్వీ కపూర్ గ్లామర్ ప్రెజెంటేషన్‌పై కొంతమంది నెగిటివ్‌గా స్పందించారు. దీంతో దర్శకుడు బుచ్చిబాబు స్పందించి, ప్రేక్షకులకు అసౌకర్యంగా అనిపించిన కొన్ని సన్నివేశాలను తొలగించినట్లు వెల్లడించారు.

ఇదిలా ఉంటే గత కొన్ని రోజులుగా 'పెద్ది' సినిమాలో మరికొన్ని మార్పులు చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ శనివారం నుంచి 'పెద్ది' సినిమా రన్‌టైమ్‌లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌లో వచ్చే సిసోడియా పాత్రకు సంబంధించిన సన్నివేశాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త సన్నివేశాలను జోడించనున్నట్లు సమాచారం. ఈ మార్పులు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసుకోవాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



## మరోసారి పూజా హెగ్డేకు షాక్

కొన్ని సంవత్సరాల క్రితం తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న పూజా హెగ్డే, ప్రస్తుతం వరుస పరాజయాలతో కెరీర్‌ను కొనసాగిస్తోంది. 'అల వైకుంఠపురంలో' చిత్రంతో భారీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీకి ఆ తర్వాత మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన హిట్ మాత్రం అందుకోవడం లేదు. తాజాగా పూజా హెగ్డే, వరుణ్ ధావన్ హీరోగా తెరకెక్కిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాపై పూజా హెగ్డే భారీ ఆశలు పెట్టుకోవడంతో పాటు ప్రమోషన్స్‌లో కూడా చురుగ్గా పాల్గొంది.

అయితే జూన్ 5న విడుదలైన ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గొప్ప టాక్ రాకపోవడంతో కలెక్షన్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. వీకెండ్‌లో ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోగా, వీక్‌డేస్‌లో మరింత పేలవమైన కలెక్షన్లు నమోదవుతున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకోవడం కష్టమేనని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఈ మూవీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న పూజా హెగ్డేకు మరోసారి నిరాశే ఎదురైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటించిన మృణాల్ ఠాకూర్‌కూ ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.